# దాంపత్యంలో అణా పైసలు

రంధి సోమరాజు

కథానిక

సామాన్యంగా మధ్యతరగతి స్త్రీలకు జీవితం అంటే ఎంతో భయం. పాపం వారికి డబ్బంటే ఎంతో ఆశ. కాని అది అంత అందుబాటులో ఉండదు. దీనితో ప్రతిచిన్న విషయంలోనూ ఆ భయంయొక్క సూక్ష్మ రూపంగా, పిసినిగొట్టు తనం ఏదో రకంగా బయటపడుతూ వుంటుంది.

కథలు వ్రాసే సుందరం భార్యపేరు శారదమ్మ. నాజూగ్గా ఉంటుంది. ఆధునిక వేషాడంబరంలో మునిగి తేలకపోయినా—ఆ వేషాలంటే అంత మోజు పడదని చెప్పలేం. ఇలాంటప్పుడు ఆమెను పాపం పిసినిగొట్టు మనిషి అనడం ఏం సబబుగా ఉంటుందని మీరంతా గట్టిగా నిలేసి అడగొచ్చు. కాని ఈ ఆడవాళ్ళతో వచ్చిన చిక్కంతా ఇదే. వాళ్ళ సంగతి ఖచ్చితంగా ఇదీ అని చెప్పలేం. ఇంతకీ ఉన్నది ఉన్నట్టుగానే చెప్పగలం కాని లేనిది ఉన్నట్లుగా మనమెక్కడ చెప్పగలం!

మరీ ఆమెగారి పిసినిగొట్టు తనం అంతా, ఆమె భర్తగారు చేసే ఖర్చుమీదే విరుచుక పడుతూ వుంటుంది. భర్త మంచివాడైపోయాడు కాని... మరోడు మరోడైతేనా! గాలి వాన వస్తే కథే లేనట్టు అలాంటి సంగతి మనకెందుకు లెండి...

ఇంతకీ ప్రొద్దుట అతను బజారు బజారంతా తిరిగి, తనకు కావలసిన చొక్కాగుడ్డ ఒకటి మూడు గజాల ముక్క కొనుక్కొని ఇంటికి తెచ్చుకున్నాడు. ఇంటికి వచ్చేప్పుడు భార్య ఏమంటుందో అని చికుకుచికుకు మంటూనే ఉన్నాడు. మనిషి గడసరి కాకపోవడం, గొడవలంటే ఓ విధంగా వెనకాడే రకం అవడంవల్ల 'ఎందుకొచ్చిన రభస .. కొంచెం చవక రకం కొనుకున్నా బాగుండును...' అనుకుంటూ గదిలో అడుగు పెట్టాడు.

శారదమ్మ భర్త చేతిలోని పొట్లం చూడగానే మొగం ఇంత చేసుకుంది. 'వీరికి నేనంటే ఎంత జ్ఞాపకం...' అనుకుంది. 'మొన్న నెప్పుడో చెప్పాను...నాకే గుర్తులేదు. మంచి జాకెట్టు గుడ్డొకటి తెమ్మని...' అనుకుంటూ ఆ పొట్లం వైపు ఆశగా దాన్ని తినేసేదానిలా చూసి, 'మంచి నీళ్ళిమ్మంటారా...అబ్బ! ఎండ ఎలా మండుక పోతోంది...' అంది.

సుందరం వాతావరణం బాగానే ఉందనుకున్నాడు... 'కొద్దిగా తీసుకరా...ఎక్కువగా వొద్దు...' అన్నాడు పాపం పరాకుగా. ఇంతలోనే అతను అరే...మంచినీళ్ళకూడా ఈవిధంగా అడగడమేమిటి ఏడిసినట్టుగానే ఉంది. ఎందుకిలా అన్నాను చెప్మా' అనుకుంటూ ఆలోచనల్లో మునిగి పోయాడు.

పాపం సుందరం, ఓ సంవత్సరం వేసవిలో షర్బత్తు సీసా ఒకటి కొని ఇంటికి తెచ్చుకున్నాడు. అనాడు ఆ భార్యామణి ఆ సీసా తెచ్చినందుకు పెద్ద గొడవ చేయడమే కాకుండా ఆ మరునాడు ఎప్పుడో అతను 'ఇంకో గ్లాసుడియ్యి ... చాలా బాగుంది' అన్నప్పుడు ఆమె ఇట్టే రౌద్రరూపం దాల్చి, 'ఆ సీసా మీ ముందు పడేస్తాను తాగెయ్యండి' అంటూ కోపంగా అక్కడనుంచి లేచిపోయింది. పాపం అప్పటినుంచీ అతనా షర్బత్తు అయిపోయే వరకూ...ఆ భార్యతో, ఆ షర్బత్తు కావలసివచ్చినప్పుడల్లా 'కొద్దీగా ఇయ్యి, ఎక్కువగా వొద్దు' అనేవాడు. పాపం, ఈ అలవాటు అతను ఏమరుపాటుగా ఉన్నప్పుడల్లా బయటపడుతూ ఉంటుంది. కాని మంచినీళ్ళడిగినప్పుడు కూడా అది ఇలా బయటపడటం అతనికి ఆశ్చర్యాన్నే కలిగించింది. కాని ఏంచేస్తాను? 'అలవాటొంత పనిచేస్తుంది' అనుకొని పెదవి చివర కొద్దిగానవ్వుకున్నాడు.

మంచినీళ్ళకోసం గదిలోకి వెళ్ళిన శారదమ్మ గ్లాసునిండా చల్లని మంచినీళ్ళు తెచ్చి, అతని ముందుపెట్టి, ఒక్కక్షణం ఆలస్యం చేయకుండా గబగబా వెళ్ళి ఆ పొట్లం విప్పేసింది.

ఆ పొట్లం విప్పుతూన్నప్పుడు ఆమె మొఖం చూడవలసిందే...ఏం ముచ్చటగా సిగ్గుపడిందనుకున్నారు...చిన్నతనంలో బావగారు అక్కను తీసుకపోవడానికి వస్తూన్నప్పుడు, దూరంనుంచే అతన్ని చూసి అలా సిగ్గుపడేది! బావగారి చేతిలో ఏమేమిటున్నాయో ఇట్టే పసిగట్టేది. పాపం శారదమ్మ ఆ పొట్లం విప్పుతూ ఎంత సంతోషపడిపోయిందో చెప్పలేం. ఆ కళ్ళల్లో సంతోషం రెక్కలు కట్టుకొని ఎగిరిపోతోంది! అంతే ... పొట్లం పూర్తిగా విప్పేటప్పటికి ఇంకేముంది...రెక్కలొచ్చిన ఆ సంతోషం పూర్తిగా ఎగిరిపోయింది. ఆమె మొఖంనిండా పూర్తిగా విషాదం అలముకపోయింది. దుఃఖం, ఈర్ష్య, అసూయ, అవమానం భరించలేని ఆసహనం ఆమెను చుట్టుముట్టాయి. ఆమె కంఠాన్నెవరో బూటుకాలితో తొక్కి విడిచినట్లయింది. ఆమె ఒక్కసారిగా బుసలు కొట్టింది.

"అన్ని చొక్కాలు మూలుగుతూంటే మళ్ళీ ఎందుక్కొన్నారు...?" అంది. అనడమేమిటి అరచింది.

'తనమీద అతనికి ప్రేమ లేదు. ఉంటే తను అతనికి గుర్తుతాదూ...' ఆమె మనసు మెలి లు తిరిగిపోయింది.

"ఖరీదైంది లాగే ఉంది. ఇప్పుడు కొనకపోతే ఏం పోయింది. అయినా దీని ఖరీదుకు రెండు మూడు చొక్కాలొచ్చును... సంసారమంతా ఇలాగే హారించుకపోతోంది" అంటూ వలవల ఏడ్చేసింది.

సుందరం అలాంటి సమయాల్లో పూర్తిగా నిరుత్తరుడు. ఆమె ఏమన్నా వింటాడు. సహిస్తాడు. కోపగించుకోడు. ఆమె కోపం పూర్తిగా చల్లారిన తరువాత మెల్లిగా తనను క్షమించమని కోరుతాడు. ప్రాధేయపడతాడు. బుజ్జగిస్తాడు. ఇక యిలాంటి పిచ్చిపిచ్చి పనులెప్పుడూ చేయనని ఆమెకు ఎంతో ఎంతో నచ్చజెప్పుతాడు. నిజంగా శారదమ్మ తనసౌందర్యాన్ని ఎరగావేసి అతన్ని తనమాటజవదాటలేని వలలో చిక్కించేసుకుంది. ఓవిధంగా ఆ యింట్లో సుఖంగా కాపురం చేయాలంటే, సుందరానికి పాపం ఇంతకన్నా మంచి ఉపాయం తోచలేదు. ఇద్దరూ కలిసి కోపాల కత్తియుద్ధాలతో ఒకరి నొకరు దెబ్బ తీస్తూ కూర్చుంటే, ఇరుగుపొరుగువారిముందు పల్చబడిపోవడం తప్పించి అంతకన్నా లాభించేదేముంటుందని, దూరదృష్టి కలిగిన సుఖాభిలాషి అయిన సుందరం 'సాంసారపక్షం' అంటే 'ఇదే ఇదే' అని మనసును పదిలపరచుకొని చక్కని కాపురం ఆ వీధిలో వెలగబెడుతున్నాడు. పాపం శారదైనా ఏమీ చెడ్డది కాదుగా...కొంచెం ఖర్చు తగ్గించుకోమంటుంది. అంతే...ఇది మరి వారి కుటుంబ లాభానికేగా...ఇది ఎవరైనా హర్షిస్తారు. సంతోషించలేనివాళ్ళు సుందరాన్ని భార్యా విధేయుడు అని, చవట అని అంటూ నానాకూతలు కూస్తారు. ఇలాంటి తక్కువరకం బజారు భావాలు కలిగిన వాళ్ళను మనం లెక్కచేయగూడదు.

ఆ రాత్రి శారదమ్మ సుందరంతో పూర్తిగా మాట్లాడటం మానేసింది. దీనితో సుందరానికి పిచ్చెక్కినట్లయింది. 'ఏమిటో మనసులో అశాంతి పైత్య వికారంలా ఊరికే తిప్పుతోంది. ఈ అశాంతిని కక్కేయ గలిగితే ఎంత బాగుండును అనుకున్నాడు. ఓ సిగరెట్టు కాల్చినా బాగుండును. కొంచెం ఈ వేదనైనా అరికట్ట వచ్చును అనుకున్నాడు. కాని ఇప్పుడు ఈ సమయంలో బయటికిపోతే శారద మరింత ఏడుస్తుంది. ఇక్కడే ఓ సిగరెట్టు కాల్చుకుందామనుకున్నా ఈ సమయంలో అసలుకే మోసం వస్తుంది...ఎలా... అనుకున్నాడు. పాపం శారదమ్మ ఎంతో పట్టుపట్టి అతని చేత సిగరెట్లు కాల్చడం మాన్పించేసింది. సిగరెట్లు కాల్చకపోతే అతను ఒకానొకప్పుడు ప్రాణం పోతుందేమో అన్నంతగా ఉండేవాడు కాని అట్లాండివాడిచేత పూర్తిగా సిగరెట్లు మాన్పించి వేయగలిగిందంటే, ఆమెను మనం ఎంతగానో కొనియాడాలి. అలగడం, కోపగించుకోవడం, విసురుగా మాట్లాడటం, దూషించడం మొదలైన ఆయుధాలను విడిచిపెట్టేసి ఈ విషయంలో ఆమె మరో మంచిపద్ధతి అవలంబించింది. 'నే నీ సిగరెట్ల కంపు భరించలేను బాబూ...'అనేది. 'ఛీ...అసహ్యం...ఏమిటీ వెధవ కంపు...కుళ్ళు కాలువ కంపు...ఇలా అయితే మిమ్మల్ని దగ్గరకు చేరనివ్వను...' అనేది. దీనితో అతను అతి కష్టం మీదే ఆమెను ఆనంద పరచడానికి, తద్వారా

తను సుఖించడానికి, సిగరెట్లు విడిచి పెట్టేశాడు. కాని అప్పుడప్పుడు మరీ చికాగ్గా ఉంటే వాటిని కాలుస్తూ వుంటాడు. కాని ఆ నాడు ఇంటికి వచ్చేప్పుడు కొంచెం జాగ్రత్తగానే వస్తూవుంటాడు. అయినా ఈ విషయంలో శారదమ్మ—సిగరెట్లు ఊరికనే వస్తే కంపు విషయంలో అంత బాధ పడదని తెలుసుకునేప్పటికి, సుందరానికి సిగరెట్ల మీద అంత మోజు తగ్గిపోయింది. అందులో ఆ సిగరెట్లు ఊరికినే ఎల్లావచ్చిందీ ఎంతో జాగ్రత్తగా ఆమెగారి ప్లీడరు ప్రశ్నలకు సరియైన జవాబులిచ్చి ఆమెను మెప్పించగలిగే తాహతు అతనిలో లేదు.

ఇక ఆ రాత్రి మరీ గత్యంతరంలేక సుందరం కాగితం కలం తీసుకొని ఇంతకుముందే ఆలోచించిన ఓ కథ వ్రాసెయ్యడానికి, ప్రస్తుతపు బాధ మరచిపోడానికి ఉపక్రమించాడు. భార్య తన వెనకనే కాస్త దూరంలో పడుకొని ఎర్రనికళ్ళతో తనవైపు కొరకొర చూస్తోందన్న విషయాన్నే మరచిపోయి తన రచనలో మునిగిపోయాడు. సమస్తాన్నీ మరచి అందులో ఐక్యమైపోయాడు. తన హృదయాన్ని ఆ కాగితాలకు అంకితం చేసుకున్నాడు. అతనిలో దాగిన కథ ఇక ప్రవాహంగా ప్రవహించింది. ఎక్కడా ఆగకుండా ఆ రచన ముందుకు సాగిపోతోంది. ఒకసారి కలం నిలిచింది. ఒకసారి మొహం తీవ్రరూపం దాల్చింది. పదాలు నేనంటే నేనంటూ ముందుకు దూకుతున్నాయి. ఇది కాదు ఆ పదం' అంటూ మనసు వేవేగంగా నాట్యం చేస్తోంది. ఈ భావం అద్భుతంగా ఉందని అతని ఆత్మ ఎంతో ఎంతో శ్లాఘిస్తోంది. "ఇక్కడ బాగు లేదు, కొద్దిగా నిందించి పోయాడు. ఇంకొంచెం ప్రయత్నం చేయి' అంటూ జాగ్రత్తగా సలహా లిస్తోంది. అలాఅలా కలం చకచకా సాగిపోతుంది. ఉండిఉండి అతని మనసు మధురాతి మధురమైన ఊహాల స్వర్గాని కెగిసిపోతోంది. తెలి మబ్బు పాన్పుపై పవ్వళించి, చిత్రంగా కలం పాళీని చీల్చి, అందులో చంద్రుణ్ణి మోహానంగా గ్రుచ్చి, అతన్ని ఓ విసనకర్ర చేసి హాయిగా హాయిగా విసురుకుంటూన్నట్టు మనసు మధురమైన సుఖానుభూతి ననుభవిస్తోంది. అంతా నిశ్శబ్దంగా ఉంది. కాగితం మీద కలం ఆలపిస్తూన్న మోహనగానం అమితోత్సాహంతో ముందుకు మునుముందుకు సాగిపోతోంది.

అతను పూర్తిగా ప్రపంచాన్ని మరచిపోయాడు. ఆ కథలోని పాత్రల్లో కలిసిపోయాడు. అందులోని వర్ణనల పూదోటల్లో విహరిస్తున్నాడు.

అప్పుడే అతని భార్య ప్రళయంగా అరిచింది: "ఇలా అయితే మన చేతికి చిప్పొస్తుంది' అంది.

అతని కలం నిలిచిపోయింది. అతని గుండెలో కలత, ఎడతెగని బాధ అంతులేని వ్యథ తుఫానులా విజృంభించాయి. అంతే, పాపం అతను తుఫానులో చిక్కుకున్న గూడులేని పులుగులా గజగజ వణికిపోయాడు. ఆమెవైపు దీనంగా 'ఇప్పుడు నేనేం చేశాను?" అన్నట్టు, "ఒకవేళ నాకు తెలియక ఏమైనా చేస్తే క్షమించు" అన్నట్టు జాలిగా చూశాడు. కాని ఆమె క్షమించలేదు. అతని లోనికి ఆమె ఈషణ్మాత్రమూ తొంగిచూడలేదు.

"నెలనెలా కరెంటు కెంతిస్తున్నామో గుర్తుంటేగా ఆ మొహానికి! మీ ఇష్టమొచ్చినట్లు కాల్చండి. కాగితాలు ఖరాబు చేస్తూ దమ్మిడీ రాని చెత్తవ్రాతలు వ్రాస్తూ కూర్చోండి!" అంటూ బుసలుకొట్టింది.

కవిగారి చేతిలోని కలం జారిపోయింది. వ్రాస్తూన్న కథ సగంలోనే ఆగిపోయింది.

పాపం సుందరం మెల్లిగా, "అదికాదు శారదా వాళ్ళు నాకు డబ్బు పంపుతారు" అనబోయాడు. కాని ఇంతలోనే అతని గుండె గబగబా కొట్టుకుంది. "ఈ మాట చెప్పకూడదు, ఈ మాట చెప్ప కూడదు"అంది. అంతే, అతని పెదవులు మాట్లాడబోతూన్నట్లు కదిలి ఆగిపోయాయి.

అతని ఎదలో లోలోపల ఓ మూల ఆ 'నిజం' దాగి "ఇంతకన్నా రహస్యమైన స్థలం దొరికితే ఎంత బాగుండును" అనుకుంటూ ఓ మూల్గు మూల్గింది. గదినిండా అలముకున్న చీకటి, 'దుఃఖంచకు సుందరం' అంది. 'అయ్యో ఈ క్షణంలో నాకు వెన్నెలగా మారిపోయే శక్తి ఉంటే ఎంత బాగుండును' అని ఏడ్చింది.